"లేదు నాన్నగారూ! నిజాన్ని చూపిస్తోంది. దాన్ని భరించలేని భయస్థులూ, అలా వ్రాయలేని రచయితలూ, అది వెర్రితలలు వేస్తోందని ప్రచారం చేస్తున్నారు. మన పక్కనే కూర్చుని మనతో మాట్లాడేవాడే హార్డ్ కోర్ టెర్రరిస్ట్ అయినా దాన్ని మనం గుర్తించలేని స్థితిలో వున్నాం. అంత భయంకరంగా వున్నాయి పరిస్థితులు" ఆవేశంగా అన్నాడు విహారి.

పరమేశ్వరం నవ్వి, కొడుకు భుజం తట్టాడు. స్నేహితులిద్దరూ వెళ్ళిపోయాక అతడు రామ్‌లాల్‌కి ఫోన్ చేశాడు. "రామ్‌లాల్. రేపు ఆడిటోరియంలో నా పక్క సీట్లో మన వాళ్ళు ఎవరన్నా కూర్చునే ఏర్పాటు చెయ్యి."

"అలాగే."

పరమేశ్వరం ఫోన్ పెట్టేసి మరో అనుచరుడికి ఫోన్ చేశాడు. సునాదమాల వివరాలు చెప్పి, "ఆ అమ్మాయి చేతి వ్రాత సంపాదించి, అలాంటి అక్షరాల్తోనే కొన్ని ప్రేమ లేఖలు వ్రాసి, పద్మాకర్ ఇంట్లో అతడి గదిలో దొరికే ఏర్పాట్లు చెయ్యి. రేపు రాత్రికి ఇదంతా ఏర్పాటు జరిగిపోవాలి."

అవతలి మనిషి ఇటువంటివి అమలుజరపటంలో ఎక్స్‌పర్ట్.

"అలాగే" అన్నాడు వినయంగా.

పరమేశ్వరం లేచి విహారి గదిలోకి వెళ్ళాడు. నాటకం వస్తువులన్నీ ఒక బ్యాగ్‌లో వున్నాయి. అతడి చెయ్యి వాటిని వెతికింది. రెండు నిముషాలతరువాత దొరికింది.

డమ్మీ పిస్తోలు. నాటకాల్లో ఉపయోగించేది.

** ** **

నాటకం రసపట్టులో సాగుతోంది.

రెండు అంకాలు పూర్తయ్యాయి.

పరమేశ్వరానికి ఒక పక్క వర్ధనమ్మ కూర్చుని వుంది. రెండో పక్క ఒక సూటు వ్యక్తి వున్నాడు.

కథ క్లైమాక్స్‌కి చేరుతోంది.

పరమేశ్వరం సైగ చేశాడు. పక్క వ్యక్తి లేచి కర్టెన్ వెనక్కి వెళ్ళాడు. నాటకంలో పాత్రధారులు రంగస్థలం మీదకి తీసుకువెళ్ళవలసిన వస్తువుల్ని అందుబాటులో పెట్టుకుంటారు. అన్నీ అక్కడే వున్నాయి.

మిగతా పాత్రధారులందరూ, జరుగుతున్న నాటకాన్ని తెరల చాటు నుంచి ఉత్సుకతతో చూస్తున్నారు. సూటు వ్యక్తి నెమ్మదిగా వంగాడు.

డమ్మీ పిస్తోలు తీసి, అచ్చంగా అటువంటిదే మరో పిస్తోలు పెట్టాడు.

తరువాత తన స్థానానికి వచ్చి కూర్చున్నాడు.

నాటకం ముగింపుకి వచ్చింది. పరమేశ్వరం భార్యవైపు వంగి "ఈ సునాదమాల ఎవరో నీకు తెలుసా?" అని అడిగాడు.

"లేదండి" అందామె.

"నా వుద్దేశంలో ఆ అమ్మాయి ఏదో నాటకం ఆడుతోంది. ఆమెకీ, పద్మాకర్‌కీ మధ్య ఏదో గ్రంథం సాగుతోందని నా అనుమానం."

"నిజమా" అంది వర్ధని ఆందోళనతో. "మన అబ్బాయి అంతలా మోసపోతున్నడా-వాడిని వెంటనే హెచ్చరించాలి."

"అది ఎలాగూ చేస్తామనుకో. కానీ వాడు ఇదంతా తెలిసి ఆ అమ్మాయిని కానీ, పద్మాకర్‌ని గానీ ఏదైనా చేస్తే" పరమేశ్వరం మాటలు పూర్తి కాలేదు.

"ఢాం" అని పిస్తోలు పేలింది స్టేజిమీద.

మంత్రి వేషంలో వున్న విహారి వికటాట్టహాసంతో తెర పడింది.

ఆడిటోరియంలో చప్పట్లు.

పరమేశ్వరం భార్యతో లేచి స్టేజి మీదకు వెళ్ళాడు. అక్కడ పరిస్థితి బయటిదానికి వ్యతిరేకంగా వుంది. పద్మాకర్ రక్తపు మడుగులో వున్నాడు. ఒక బుల్లెట్ మెదడులోంచి, మరొకటి గుండెల్లోంచి వెళ్ళిపోయి వుంది. ప్రాణం పోయి ఎంతసేపయిందో తెలీదు. విహారి శిలా ప్రతిమలా నిలబడి వున్నాడు. చేతిలో పిస్టల్ ఇంకా అలాగే వుంది.

వర్ధనమ్మ కెవ్వున అరిచి ముందుకు పరుగెత్తింది.

పరమేశ్వరం వెళ్ళలేదు. చిన్న స్వరంతో అన్నాడు "ఒకే అమ్మాయిని ఇద్దరు ప్రేమించారు- స్టేజిమీద నాటకం ఆడినట్టు నటించి స్నేహితుడిని మర్డర్ చేసిన కోల్డ్ బ్లడెడ్ హంతకుడు విహారి! మాల ప్రేమ లేఖలు పద్మాకర్ గదిలో దొరుకుతాయి!! పద్నాలుగు సంవత్సరాలకు తక్కువ కాకుండా విహారికి శిక్ష పడుతుంది. వెళ్ళు. వెళ్ళి స్వామికి చెప్పు. పరమేశ్వరం చెప్పిన మాట నిలబెట్టుకున్నాడనీ-స్వంత కొడుకు యవ్వన కాలాన్ని జైలు గోడల మధ్య సమాధి చేశాడనీ చెప్పు."

పక్క వ్యక్తి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

పరమేశ్వరం కొడుక్కి దగ్గరగా వెళ్ళాడు. "విహారీ-ఏమిట్రా ఇది?" అన్నాడు ఆందోళనగా.

షాక్ నుంచి విహారి అప్పుడే స్పృహలోకి వచ్చినట్టు "నాన్నగారూ" అన్నాడు.


"ఎంత పని చేశావు విహారీ-"

విహారి చేతిలోంచి పిస్తోలు జారిపడింది.

వర్ధని ఏడుస్తోంది-"ఏమండీ-బాబుకి ఏమవుతుందండీ-"

పరమేశ్వరం జవాబు చెప్పలేదు. దేశంలోని ఏ లాయరూ ఇక విహారిని రక్షించలేడని అతడికి తెలుసు.

(ఇంకావుంది)



## పాత్రలలో కథ

సునాదమాల మనసంతా చికాకుగా వుంది. నికుంజ్ విహారి ప్రవర్తన, కాలేజీలో నలుగురి ముందు తననలా ఏడిపించడంలో అతని ఉద్దేశ్యం అంతుపట్టడంలేదు.

వంటింట్లోంచి బామ్మ భోజనానికి రమ్మన్న పిలుపు కూడా ఆమెకి వినపడలేదు. ఇంతలో వాకిట్లో కారాగిన చప్పుడూ, అందులోంచి దిగిన ప్రవల్లిక...

వేగంగా లోనికి వచ్చి "బామ్మ గారెక్కడ" అంది. అపుడే లోనుంచి వచ్చిన బామ్మ కంగారుగా "ఏమైందమ్మా ప్రవల్లికా! మళ్ళీ టెర్రరిస్టుల గొడవేమైనా వచ్చిందా?" అంది.

"అది కాదండి ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు."

"ఏ విషయం" అంది ఆతురతగా బామ్మ.

"నికుంజ్ విహారి ఆత్మహత్యా ప్రయత్నం చేసాడండీ" అంది ఒక్కో మాట వత్తి పలుకుతూ. ఒక్కసారిగా బామ్మ, సునాదమాల నిశ్చేష్టులయ్యారు ఆ మాటలకి.

"ఇపుడే వర్ధనమ్మగారు ఫోన్ చేసి చెప్పారు. వెళ్తూ వెళ్తూ మీకు చెప్పి వెళ్దామని ఇటు వచ్చాను. రా దలుచుకుంటే నాతో రండి" అంది ప్రవల్లిక.

### మనసు

బామ్మగారు ముందు తేరుకుని "పదమ్మా మాలా, మనకు ఎంతో మేలు చేసిన ఆయన. వెళ్ళడం మన కర్తవ్యం, కృతజ్ఞత అనిపించుకుంటుంది" అని సునాదమాలని మరో మాటమాట్లాడకుండా బయల్దేరదీసింది.

తీరా వీళ్ళు వెళ్ళేసరికి అంతా కర్బి హాస్పిటల్‌కి వెళ్ళారని నికుంజ్ విహారి ఇంటి నౌకరు చెప్పాడు. సునాదమాల కంతా అయోమయంగా వుంది. కాలేజీ దగ్గర తన ప్రవర్తనతో అతను హర్ట్ అయ్యాడని మనసు నొక్కి చెబుతోంది.

ఇపుడు విచారించి లాభం లేదు.

ఒక్కసారిగా బాధ పెల్లుబికి, బామ్మని కౌగలించుకొని "బామ్మా! దీనికంతటికి నేనే కారణం. నేనే ఆయన్ని అవమానించాను. మనకు చేసిన సహాయానికి కృతజ్ఞతగానైనా ఆయనతో సరిగ్గా మాట్లాడలేదు" ఏడుస్తూ చెప్పింది-

ప్రవల్లిక సునాదమాల భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేసి "ఊరుకో యిపుడేం జరిగిందని, ఆయనకింకా ఏమీ కాలేదు కదా" అంది ఓదార్పుగా...

ఇంతలో కారు ఆగిన చప్పుడు విని పక్కకు తిరిగిన వీళ్ళను నికుంజ్ విహారి 'హల్లో' అని గ్రీట్ చేస్తూ "ఏమిటి అందరూ ఒక్కసారిగా దండెత్తి యిలా వచ్చారు" అన్నాడు నవ్వుతూ.

సునాదమాల మనసు ఒక్కసారిగా తేలికవగా, సిగ్గుతో కుంచించుకు పోయింది తన అవివేకానికి...

కాని ఆమెకు అర్థం కాని విషయం ఒకటే...

ఇది ప్రవల్లిక ఆడిన నాటకమా? బామ్మ వలవా? విహారి, విన్యాసమా?

— బి. వెంకటేశ్వరరావు.